మారువేషంలో ఉంటే మాత్రం సరోజ ఒక అబ్బాయిని రహస్యంగా పార్కులో కలిసిందీ అంటే ఆ అబ్బాయిని రాంబాబుగానే అనుమానిస్తారు. వెంటనే దగ్గరకు వచ్చి రాంబాబు విగ్గూ వేషం పీకేసి అరెస్టు చేస్తారు.'

రాంబాబు దిగులుగా మొహం పెట్టాడు.

'మరి మీసం?' కిష్టయ్య సందేహంగా అడిగాడు.

'మీసం గొరిగేయడమే.'

'అమ్మో వద్దు....నేను పార్కుకి రానని మళ్ళీ ఫోన్‌చేసి చెప్పేయ్‌రా కిష్టయ్యా.....' మీసాన్ని చేత్తో మూస్కుంటూ అన్నాడు రాంబాబు.

'మీసందేముంది గురూగారూ...నాల్రోజుల్లో వస్తుంది......సరోజ గారు మీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలన్నారు......బహుశా కేసుకి సంబధించే అయి ఉంటుంది...... మీరు తప్పకుండా వెళ్లాల్సిందే....మీరు అమ్మాయి వేషంలో వస్తున్నట్లు నేను సరోజకి ఫోన్‌చేసిచెప్తాను.

'అవును రాంబాబూ .....వెళ్ళు ....సరోజ నీకు పనికి వచ్చే విషయమే చెప్తుందనుకుంటా .....' అన్నాడు శ్యామల్రావు.

ఇద్దరూ రాంబాబుని ఒప్పించారు.

'మీరు పట్టుచీరకట్టుకుంటారా, ఏ చీరైనా ఫరవాలేదా అన్నయ్య గారూ?.....' అడిగింది జయంతి.

'ఏదో ఒక చీర ఇవ్వండి' సిగ్గుపడ్తూ అన్నాడు రాంబాబు.

అలా మీసం గొరుక్కుని ఆడవేషం వేస్కుని పార్కుకి బయలుదేరాడు రాంబాబు.

రాంబాబు మరోసారి వాచ్‌వంక చూశాడు.

అలా మీసం గొరుక్కుని ఆడవేషం వేస్కుని పార్కుకి బయలుదేరాడు రాంబాబు.

రాంబాబు మరోసారి వాచ్‌వంక చూశాడు.

టైము పదింపావు అయింది.

పది గంటలకు రమ్మన్న సరోజ ఇంకా రాలేదేం?.... ఏదైనా ఆటంకం కలిగిందా?..... అసలు సరోజ చెప్పబోయే ముఖ్యమైన విషయం ఏమై వుంటుంది?....

రాంబాబు మనసు పరిపరి విధాల ఆలోచిస్తుంది. ఆ టైములో పార్క్‌కి ఎవరూ రారు కాబట్టి పార్కు అంతా ఖాళీగా ఉంది. ఎక్కడా పురుషుల జాడ లేదు.

సరోజ త్వరగా వస్తే బాగుండును ....... అలవాటులేని ఈ డ్రస్సులో చికాకుగా ఉంది.... అనుకున్నాడు రాంబాబు. .....

ఇందులో.....

మరో రెండు చేతులు రాంబాబుని పట్టుకున్నాయ్.

మరో రెండు చేతులు రాంబాబుని ఎత్తుకున్నాయ్

రాంబాబు గిలగిలా తన్నుకున్నాడు.

## ఫ్రేమ్ - 30

## యాడసున్నాడో ఎక్కడున్నాడో

పరంధామయ్య పార్వతులు హైదరాబాద్  చేరేసరికి ఉదయమ అరుగంటలైంది. వాళ్ళు ఎక్కిన బస్సులోనే రాఘవేంద్రరావు వర్ధనమ్మలు ఎక్కారు. బస్టాండు నుండి ఆటో వేస్కుని వాళ్ళు హోటల్ ఆశోక్‌కి వెళ్ళిపోయారు.

పరంధామయ్య , పార్వతులు చిక్కడపల్లిలోని రాంబాబు ఇంటికి వెళ్లారు. ఇల్లు తాళం పెట్టి  ఉంది.

'ఈ కిష్టయ్య గాడెక్కడికి వెళ్లాడబ్బా ఇంత ప్రొద్దున్నే!.......' అన్నాడు పరంధామయ్య.

'వాడు కూడా రంబాబు వెంట తిరుగుతున్నాడోమో పోలీసుల్నిండి తప్పించుకుంటూ......' అంది పార్వతి.

'నీ మొహం..... రాంబాబు వెంట తిరుగున్నాడేమో పోలీసులు వెదుకుతున్నారు....కిష్టయ్య కోసం వెతుకుతూ ఉండి ఉంటే మన పాలేరుని కూడా పోలీసులు ప్రశ్నించి ఉండేవారుగా?....'

'కిష్టయ్య ముందే పట్టుబడిపోయాడేమో?!......'

'ఉండసలు పక్కింటి వాళ్లకి కిష్టయ్య వ్యవహారం ఏమైనా తెలుసో కనుక్కుంటాను....'

పరంధామయ్య పక్కింటికి వెళ్ళి రెండునిముషాల్లో వెనక్కివచ్చాడు.

ఛీ....వీడివల్ల మన వంశప్రతిష్ఠ, ఆ వ్యవహారం ఈ వ్యవహారం అంతా మంటకల్సిపోయింది... ఆ పక్కింటివాళ్లకి నేనే రాంబాబు తండ్రిని అని చెప్పుకుంటే నన్నే ఒక హంతకుడిని చూసినట్టు చూస్తున్నారు.....' అంటూ విసుక్కున్నాడు పరంధామయ్య.

'ఇంతకీ కిష్టయ్య గురించి ఏమైనా చెప్పారా?' అడిగింది పార్వతి నోట్లో పైటకొంగు దోపుకుంటూ.

'వాడిక్కడ ఒకరోజు ఉంటే ఒకరోజు ఉండడట...... ఏదో ఒక టైమ్‌లో వచ్చి పోతుంటాడట!..... సరేగాని ఏంటలా పైటకొంగును కూడా పోలీసులు వెతుకుతున్నారేమో అనుకోగలరు. ఊరుకో......'

పార్వతి కళ్ళు తుడుచుకుని  ఒక నిముషం తరువాత అడిగింది. 'ఇప్పుడేం చేద్దాం?......'

'స్టూడియో దగ్గరికి వెళ్ళి చూద్దాం .....వీడేమైనా రాతిపూట అక్కడే నిద్రపోతున్నాడో ఏంటో?..... అన్నాడు పరంధామయ్య.

ఇద్దరూ ఇస్మైల్ ఫ్లేజ్ స్టూడియోకి వెళ్లారు.

స్టూడియో కూడా తాళం పెట్టిఉంది.

'ఇంటిదగ్గరో లేక స్టూడియో దగ్గరో లేకపోతే వీడు ఎక్కడికెళ్లాడో?.....' అంది పార్వతి మళ్ళీ పైటకొంగు నోట్లో దోపుకుంటూ.

'అబ్బా!....నిన్ను నడిరోడ్లో ఏడవొద్దన్నానా?.....కిష్టయ్య గాడు ఇక్కడా అక్కడా లేడంటే వాడికి రాంబాబు ఎక్కడున్నాడో తెల్సిఉండాలి. రాంబాబుని రహస్యంగా కలుసుకోడానికి

వెళ్ళాడేమో?!'

ఆ ఆలోచన ఇద్దరికీ ఆశ కలిగించింది. కిష్టయ్యని పట్టుకుంటే రాంబాబుని కల్సు కోవచ్చు!.....

'ఇప్పుడేం చేద్దాం .....హోటల్లో దిగుదామా?' అడిగింది పార్వతి.

మనం హోటల్లో దిగుతే కిష్టయ్యనెలా పట్టుకుంటాం?....పద ...... వెనక్కి వెళ్ళి ఇంటిదగ్గరే కాపలా కాద్దాం .....కిష్టయ్య ఏ టైములో వచ్చి వెళ్ళిపోతాడో?!.....' అన్నాడు పరంధామయ్య అడుగులు ముందుకు వేస్తూ.

పార్వతి అతన్ని అనుసరించింది.

రాంబాబు ఇంటిదగ్గర అరుగుమీద పడిగాపులు కాచారు ఇద్దరూ. అప్పటికి ఉదయం పదిగంటలయింది.

అబ్బా!..... పొద్దున్న నుండీ కాఫీ కూడాలేదు..... ఆకలి వేస్తుందండీ .....స్నానం పానంలేకుండా ఎంతసేపు ఇలా పడిగాపులు కాస్తాం!.....' అంది నీరసంగా పార్వతి.

'ఒక పనిచేద్దాం..... హోటల్లో రూము తీస్కుందాం ..... కిష్టయ్య రాంగానే మనం వచ్చామని , హోటల్లో దిగామని అక్కడికి రమ్మని కిష్టయ్యకి చెప్పమని పక్కవాళ్ళతో చెప్దాం......' అన్నాడు పరంధామయ్య.

పరంధామయ్య ఇలా అంటుండగానే కిష్టయ్య వచ్చాడు. కిష్టయ్య అప్పుడే రాంబాబుని పార్కుకి పంపి శ్యామ్రావు ఇంటినుండి వచ్చాడు.

కిష్టయ్యని చూస్తూనే ఇద్దరూ కెవ్వున అరిచారు. వాళ్లని చూసి కిష్టయ్య కూడా భయంతో కెవ్వున అరిచారు.

'ఎప్పుడొచ్చారు బాబుగారూ?..... బాగున్నారా అమ్మగారూ?.... హిహిహి ..... రాంబాబు పనిమీద బెంగుళూరు వెళ్లారు....హి...... ఫోటోగ్రాఫిక్ మెటీరియల్ కొనడానికి .....హిహీ .....ఎప్పుడు మళ్ళీ హైదరాబాద్ వస్తాడో! .....మీరన్ని రోజులు ఎదురు చూడగలరా?......హిహి......' అన్నాడు కిష్టయ్య కంగారుగా.

పార్వతి, పరంధామయ్యలు జాలిగా కిష్టయ్య వంక చూశారు.

'రాంబాబు మీద హత్యానేరం , స్మగ్లింగ్ నేరం పడగానే పాపం వీడి మతి చెలించినట్లుదండీ..... చూశారా ..... ఆ పిచ్చి చూపులూ..... ఆ పిచ్చి నవ్వూ?.... వీడికి మన రాంబాబంటే ఎంత ప్రేమో!!......' అంది పార్వతి నోట్లో పవిటకొంగు దోపుకుంటూ.

కిష్టయ్య వాళ్లవంక ఆశ్చర్యంగా చూశాడు.

'అయితే మీకు అంతా తెలుసా బాబుగారూ?' అన్నాడు.

'తెల్సు...... వాడిగురించి మనింటికి పోలీసులు వచ్చారు.....ఇంతకీ వాడెక్కడున్నాడో నీకు తెల్సా?' అడిగాడు పరంధామయ్య.

'తెలీదు..... ముందు లోపలికి వెళ్దాం పదండి......' అంటూ తాళం తీశాడు.

ముగ్గురూ లోపలికి అడుగు పెట్టగానే తలుపులు మూసి లోపల్నుండి గడియపెట్టి అన్నాడు కిష్టయ్య. 'రాంబబెక్కడ ఉన్నాడో నాకు తెల్సుబాబుగారూ.... అమ్మగార్ని పైటకొంగు నోట్లోంచి తీసెయ్యమనండి.....'

'ఇందాక ఎక్కడున్నాడో తెలీదన్నావ్. ఇప్పుడు తెలుసు అంటున్నావ్.... నీ వ్యవహారం నాకేం అర్థం కావడంలేదు.'

'మరి రాంబాబెక్కడ ఉన్నాడో నాకు తెల్సని అలా వీధిలో చెప్తే అందరూ పరుగెత్తుకుని రారూ ఎక్కడ ఉన్నాడూ .....ఎక్కడ ఉన్నాడూ .... అంటూ'

'ఈ వీధిలో వాళ్లకి రాంబాబంటే ఎంత ప్రేమోచూశావా పార్వతీ' ఆర్ద్రత నిండిన స్వరంతో అన్నారు పరంధామయ్య.

'అదేంకాదు.... రాంబాబుని పోలీసులకు పట్టిస్తే పదివేల రూపయల బహుమతిని ప్రకటించారు .... అందుకు.....' అన్నాడు కిష్టయ్య.

'ఇంతకీ అసలు నిజంగా నాడు నేరంచేశాడా? ఏంజరిగింది?..... వాడేక్కడ ఉన్నాడూ?..... ఆ వ్యవహారం అంతా వివరంగా చెప్పు......'

కిష్టయ్య చెప్పడం ప్రారంబించాడు.

### *కిడ్నాప్*

సరోజ తయారై టైమ్ చూస్కుంది. పదిగంటలైంది.

అమ్మో!..... రాంబాబు ఈపాటికి ఇందిరా పార్కుకి వచ్చేసి ఉంటాడు. .....తను త్వరగా వెళ్లాలి అనుకుంది సరోజ.

గబగబ హాల్లోకి వచ్చింది. అక్కడ సోఫాలో కూర్చుని పేపరు చదువుకుంటున్నాడు రాజశేఖరం.

'నాన్నా!..... ' పిలిచింది సరోజ.

తలెత్తి చూశాడు రాజశేఖరం.

'మీరు బయటికి ఎక్కడికైనా వెళుతున్నారా?'

'లేదు.....ఏం?' అడిగాడు రాజశేఖరం.

'నాకు అర్జంటుగా బయటికి వెళ్ళే పని ఉంది.....ఓసారి కారు తీస్కెళతా....'

'అలాగే.....'

ఇంతలో రామయ్య పరుగెత్తుకు వచ్చాడు.

'కాఫీతాగండి అమ్మాయిగారూ....కాఫీ తాగి వెళ్లండి.....'

'వద్దులే రామయ్యా.......' అంది సరోజ.

'చిక్కని కాఫీ కాచి పట్టుకొస్తా అమ్మాయిగారూ.... అయిదు నిముషాల్లో తెస్తా కూర్చోండి అమ్మాయిగారు......'

'వద్దురా ....నాకు టైంలేదు.....'

'పోనీ మజ్జిగ తేనా అమ్మాయిగారూ?......'

'నాకిప్పుడు  ఏమీ వద్దు..... ' అంటూ టైం చూసుకుని.

'అమ్మో......! పదీ అయిదు అయింది.....' అంటూ బయటికి పరుగుతీసింది సరోజ.

'అమ్మాయిగారూ....పోనీ పళ్లరసమైనా తాగండి అమ్మాయిగారూ ప్లీజ్ అమ్మాయిగారూ..నామాట వినండి అమ్మాయిగారు....' వెనుక నుండి రామయ్య అరుస్తున్నాడు.

సరోజ కారు స్టార్ట్ చేసి రివ్వున మెయిన్‌రోడ్ మీదికి వచ్చింది.

ఇందిరా పార్కుకి పదినిమిషాల్లో చేరుకుంది సరోజ. కారు పార్కు చేసి పార్కులోకి అడుగు పెట్టింది.

చాలా దూరంగా ....ఒంటరిగా ఒకమ్మాయి కూర్చుని ఉంది. గంధం కలర్ గార్డెన్‌సిల్క్ శారీతో ....జడలో పూలతో....

రాంబాబే!.....

కిష్టయ్య ఫోన్‌చేసి చెప్పాడు రాంబాబు ఇలా అమ్మాయి వేషంలో గంధం కలర్ శారీ కట్టుకుని వస్తున్నట్టు.

'పాపం! రాంబాబుకి ఎన్ని కష్టలు వచ్చాయ్.....'

అటూవంటి సందర్భంలో కూడా రాంబాబుని అలా చూడగానే నవ్వొచ్చింది సరోజకి.

వడివడిగా అడుగులు వేయబోయిన సరోజ చటుక్కున ఆగిపోయి కళ్ళు విప్పారించి చూసింది. ఆమెకేదో అనుమానం వచ్చి చటుక్కున క్రోటన్ వెనక నక్కి రాంబాబు కూర్చుని ఉన్న దిక్కుకి చూసింది.

రాంబాబు వెనకవున్న పొదలమాటు నుండి ఇద్దరు గూండాలలాంటి వారు మెల్లగా లేచి నిలబడ్డారు. అందులో ఒకడి జుట్టు దుబ్బులా పెరిగి వుంది. రెండోవాడికి నున్నటి గుండు ఉంది.

వాళ్ళు మెల్లగా రాంబాబు వెనకాలకి రసాగారు.

రాంబాబుకి ఏదో ప్రమాదం వాటిల్లింది. వాళ్ల ఆకారాల్ని బట్టి చూస్తే రాంబాబు వర్ణించి చెప్పిఅన జగ్గూ, వీరూలే వీళ్ళు అయి ఉండొచ్చు అనుకుంది సరోజ.

రాంబాబుని వాళ్ళు గుర్తించారా?.....గుర్తిస్తే ఇప్పుడు రాంబాబుని ఏం చేద్దామని?.....

వాళ్లు మెల్లగా రాంబాబుని సమీపించారు. రాంబాబు వీళ్లని చూడలేదు. జడ, పైట సవరించుకుంటూ ఎటో చూస్తున్నాడు.

సరోజ రాంబాబుని హెచ్చరిస్తూ గట్టిగా అరవాలని అనుకుంది. కానీ అందువల్ల తనకీ, రాంబాబుకీ ఇద్దరికీ ప్రమాదమే తప్ప ప్రయోజనం ఏమీలేదు. అందుకే నోరు మెదపకుండా క్రోటన్ చాటునుండి చూడ సాగింది.

దుబ్బు జుట్టుగాడు వెనుకనుండి రాంబాబు నోరు నొక్కేశాడు. గుండుగాడు రెండు

చేతుల్తో రాంబాబుని ఎత్తి భుజాలమీద వేస్కున్నాడు.

***రేపుకి రెడీ!***

ఆ అండర్ గ్రౌండ్ డెన్ గిగ్‌బాస్ వికటాట్టాహాసంతో దద్దరిల్లింది.

'వెల్‌డన్ మైడియర్ జగ్గూ అండ్ మీరూ.....ఇంతకీ ఈ చిలకని ఎక్కడనుండి కొట్టుకొచ్చారు?' అన్నాడు బిగ్‌బాస్ గ్లాస్‌వాల్ వెనకనుండి ఆడపిల్ల వేషంలో ఉన్న రంబాబుని చూస్తూ.

'ఇందిరా పార్కు మీదుగా వెళ్తుంటే ఈ అమ్మాయి ఒంటరిగా పార్కులోకి వెళ్లడం కనిపించింది. మనకి ఉపయోగపడ్తుందనిపించి ఈ అమ్మాయిని ఫాలో అయి పట్టి తెచ్చేశాం!......' అన్నాడు వీరూ గర్వంగా గుండుమీద చేత్తో రుద్దుకుంటూ.

'శబాష్ వీరూ...... ఈవేట్టినుండి నిన్ను పర్మనెంట్‌చేస్తున్నాం...... జగ్గూ!..... నీ జీతం పెంచుతున్నా .....హహహ.....' భయంకరంగా నవ్వాడు బిగ్‌బాస్.

కానీ ఆ నవ్వుకి రౌడీమూకలో ఏ మాత్రం చలనంలేదు.

బిగ్‌బాస్‌కి అనుమానం వచ్చింది. ఓ మారు తన ముందు ఉన్న మైక్‌ని వేలితో తట్టి.

'హలో ....మైక్ టెస్టింగ్....ఓన్ .....టూ.....త్రీ.....ఫో.....హ...... హ.....హ.....' అంటూ నవ్వాడు.

ఊహూ..... రౌడీముకలో ఇంకా చలనంలేదు.

బిగ్‌బాస్ మళ్లీ మైకుమీద వేల్తో తట్టి 'హలో....మైక్ టెస్టింగ్...నన్.....టూ.....థ్రీ......'అనసాగాడు.

ఇంకా లాభం లేదని జాకాల్ కల్పించుకున్నాడు.

బాస్ .....మీ నవ్వు మాకు బాగానే వినిపిస్తుంది.....' అన్నాడు.

'మరి ఎవ్వరిలోనూ చలనం లేదెందుచేత?' ఆశ్చర్యంగా అదిగడు బిగ్‌బాస్.

'డెన్‌లోకి ఆడకూతురు వచ్చేసరికి అందరూ మైమరిచిపోయారు బాస్. అందరూ ఆ అమ్మాయిని పరవశంగా చూస్తున్నందువల్ల మీ నవ్వుని వాళ్ళు అంతగా పట్టించుకోలేదు బాస్ ...... ' అన్నాడు జాకాల్.

'ఓహోహ్హో హ్హో .....హోహ్హో హ్హో......హహహ' బిగ్‌బాస్ ఉత్సాహంగా నవ్వాడు.

రాంబాబు నీడలా కనిపిస్తున్న బిగ్‌బాస్ వంకే చూడసాగాడు. గ్లాస్‌వాల్ వెనక చీకట్లో కూర్చున్న బిగ్‌బాస్ ఆకారమే నీడలో కనిపిస్తుంది గానీ మొహం మాత్రం కనిపించడలేదు.

ఎవరీ బిగ్‌బాస్?

ఇంతకీ వీళ్ళు తనని ఎందుకు ఇక్కడికి తీసుకువచ్చారు?

రాంబాబు మనసు పరిపరివిదాల ఆలోచిస్తోంది.